ప్రజాశక్తి
బుధవారం 9 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

సీతానగరం సరిహద్దుల్లో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - సీతానగరం

మండల సరిహద్దు గ్రామాలైన గుచ్చిమి, తాన సీతారాంపురం, పులుగుమ్మి గ్రామాల హద్దుల్లో ఏనుగు గుంపు కొండపై కనబడడంతో స్థానిక గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. 7 ఏనుగుల గుంపు కొమరాడ, సంగంవలస నుంచి సోమవారం ఇక్కడికి చేరుకున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెప్తున్నారు. ఈ మూడు గ్రామాలు కొండకు అతి సమీపంలో ఏనుగులు ఉండడంతో ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు సమీపంలో ఉన్న గ్రామాలకు తిరుగుతూ గ్రామస్తులను అప్రమతం చేయడంతో పాటు హెచ్చరికలు కూడా జారీ చేశారు.

పండగ పూటా పస్తులేనా?

42 నెలలుగా జీతాలకు నోచుకోని వైటిసి సిబ్బంది
గర్భిణుల హాస్టల్ ఉద్యోగులకు 25నెలలు పెండింగ్
ఆకలి కేకలు పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)ల్లోను, గర్భిణుల వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బంది ఆకలి కేకలు వేస్తున్నారు. తమకు రావాల్సిన జీతాలు ఇప్పించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నారు. ఏళ్ల తరబడి జీతాలివ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. అసలే చాలీచాలని జీతాలతో పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం ఇంత వివక్ష చూపడం తగునా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2016లో టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేటల్లో యూత్ ట్రెయినింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అప్పటి ప్రభుత్వం ఈ కేంద్రాలను ప్రారంభించింది. ప్రారంభించిన కొన్నేళ్ల వరకు వైటిసి సిబ్బందికి జీతాలు మంజూరయ్యాయి. ఆ సమయంలో నిరుద్యోగ యువతకు అనేక శిక్షణా తరగతులు కూడా నిర్వహించారు. ప్రారంభించే నాటికి ఒక్కో వైటిసిలో పది మంది పైగానే ఉద్యోగులు పని చేస్తుండేవారు. మేనేజర్, హాస్టల్ వార్డెన్, అటెండర్లు, గార్డెనర్లు, సెక్యూరిటీ గార్డులు, వంటమనుషులను నియమించారు. టిడిపి ప్రభుత్వం ఉన్నంత కాలం వైటిసి సిబ్బందికి మూడు, ఆరు నెలలకోసారైనా జీతాలు అందాయి. యువతకు శిక్షణ కార్యక్రమాలు కూడా జరిగాయి.

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైటిసిలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. సిబ్బంది జీతాలు మంజూరు చేయలేదు. యువతకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించలేదు. అప్పటి నుంచి వైటిసి సిబ్బంది జీతాలు ఇప్పించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేస్తునే వున్నారు. ఏళ్లతరబడి జీతాలు అందకపోవడంతో వైటిసిల్లో పని చేస్తున్న సిబ్బంది అనేకమంది ఉద్యోగాలను వదిలేశారు. కొంతమంది అనారోగ్య కారణాలతో మరణించారు. ప్రస్తుతం పని చేస్తున్న వారు తక్కువమందే ఉన్నారు. సాలూరు వైటిసిలో ఆరుగురు, గుమ్మలక్ష్మీపురంలో ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. ఈ ఉద్యోగాలే జీవనాధారమని నమ్ముకుని పని చేస్తున్న సిబ్బందికి 42 నెలలుగా జీతాలు మంజూరు కాలేదు. కనీసం పండుగ పూటైనా జీతాలివ్వాలని వారు ఇటీవల సాలూరులో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా ఏ ఒక్కరూ జీతాల గురించి హామీ ఇవ్వలేదు. మరో మూడు రోజుల్లో దసరా పండుగ వస్తోంది. ఈ పండుగ నాటికైనా తమ ఆకలి కేకలు వినాలని వారు కోరుతున్నారు.

సాలూరులోని వైటిసి కార్యాలయం

గర్భిణుల వసతి గృహ సిబ్బందికీ అవే కష్టాలు

జిల్లాలోని రెండు వైటిసిల్లోనూ గిరిజన గర్భిణుల వసతి గృహాలున్నాయి. వీటిని 2017లో అప్పటి ఐటిడిఎ పిఒ లక్ష్మీశా హయాంలో నెలకొల్పారు. అప్పుడు ఐటిడిఎల్లో నిధులు పుష్కలంగా ఉండడంతో ఈ వసతిగృహాల నిర్వహణకు అవసరమైన వనరులు సమకూర్చారు. 2019 వరకు వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఈ వసతి గహాల్లో ఎఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. గర్భిణులను ఆసుపత్రికి తరలించేందుకు ఒక అంబులెన్స్‌ను సమకూర్చారు. ప్రస్తుతం సాలూరు గర్భిణుల వసతి గృహంలో 11మంది, గుమ్మలక్ష్మీపురం వసతి గృహంలో 13 మంది పని చేస్తున్నారు. వీరికి ఇస్తున్నది అరకొర జీతాలే. ఉద్యోగాల్లో నియమించినప్పుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగమని చెప్పి నియమించారు. కానీ వీరికి కూడా జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు గర్భిణుల వసతి గృహం సిబ్బందికి 25నెలల జీతాల బకాయి వుంది. వీరు కూడా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ జీతాల కోసం కాళ్ళరిగేలా తిరుగుతున్నారు. అయినా కనికరం లేదు. తాము ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నామని, తమ జీవితాల్లో వెలుగు రేఖలు ఎప్పటికైనా వస్తాయన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఉద్యోగం వదులుకోలేక, కొత్త ఉద్యోగాలు దొరకక అప్పులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరు కూడా జిల్లా మంత్రి సంధ్యారాణి కి, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు వినతులు అందజేశారు. ఎవరికి ఎన్ని వినతులు సమర్పించినా జీతాల గురించి భరోసా ఇవ్వడం లేదు. దీనికి కారణం లేకపోలేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభించినప్పుడు వైటిసి, గర్భిణుల వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపు జరగలేదు. బడ్జెట్ కేటాయింపు లేకపోవడం తో వీరి ఉద్యోగాలు గాలిలో దీపాలు మాదిరిగా తయారయ్యాయి.

మిగిలిన శాఖల్లో పని చేస్తున్న సిబ్బందిలా వైటిసి, గర్భిణుల వసతి గృహం సిబ్బంది జీతాల కోసం ఆందోళనలు, ధర్నాలు చేయలేకపోతున్నారు. అధికారులను, పాలకులను నిలదీయలేకపోతున్నారు. ఎందుకంటే తుమ్మితే ఊడిపోయే ఉద్యోగాలు వీరివి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వమైనా తమ బతుకుల్లో వెలుగు నింపాలని వారు కోరుతున్నారు.

హాస్టల్ డైట్ బిల్లులూ బకాయి

గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన రెండేళ్ల వరకు సజావుగా నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలోనూ గర్భిణుల వసతి గృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు సకాలంలో మంజూరు కాలేదు. అసలే గిరిజన గర్భిణులు రక్తహీనతతో వసతి గృహాలకు వస్తారు. బాల్య వివాహాలు చేసుకున్న తర్వాత చిన్న వయసులోనే గర్భిణులవుతున్నారు. ఇలాంటి వారికి ఆరు లేదా ఏడు నెలల్లో తీసుకొచ్చి పౌష్టికాహారం, మెరుగైన వైద్యం అందిస్తే సుఖ ప్రసవం అవుతారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి డైట్ బిల్లులు అత్యవసరంగా భావించి నిధులు మంజూరు చేయాలి. కానీ వీటికి సంబంధించిన డైట్ బిల్లులు కూడా 15నెలల పైనే బకాయి వుంది. హాస్టల్ నిర్వాహకులు అప్పులు చేసి మెనూ ప్రకారం వసతి గృహాలను నడుపుతున్నారు. హాస్టళ్లలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బాత్ రూం లు, మరుగుదొడ్ల మరమ్మతుకు గురయ్యాయి. రక్షిత మంచినీరు అందించే వాటర్ ప్లాంట్ లు పని చేయడం లేదు. నిర్వహణ, మరమ్మతు పనుల బిల్లులు కూడా సకాలంలో మంజూరు కాకపోవడంతో అసౌకర్యాల మధ్యనే గిరిజన గర్భిణులు మనుగడ సాగిస్తున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

14 నుంచి గ్రామాల్లో 'పల్లె పండగ'

రూ.60కోట్లతో 313 పనులకు ప్రణాళిక సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో "పల్లె పండగ" కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్లను కోరారు. ఆగస్ట్ 23న జరిగిన గ్రామసభల్లో తీర్మానించిన అన్ని పనులకు శంకుస్థాపనలు చేసి, పనులు పూర్తిచేయాలని సంకల్పించినట్లు చెప్పారు. పల్లె పండగ షెడ్యూల్ గురించి ప్రజా ప్రతినిధులకు ముందుగా తెలియజేయాలన్నారు. నరేగాలో (ఉపాధిహామీ) సిసి, బిటి రోడ్లు, గోకులాలు, ఉద్యాన పంటలు, ఫారంపాండ్స్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న, పూర్తిచేసిన పనుల వివరాలను గ్రామస్తులకు తెలిసేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంపై మంగళవారం డిప్యూటీ సీఎం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి కలెక్టర్ కార్యాలయం వీసీ హాలు నుంచి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రూ.60 కోట్లతో 313 పనులను పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. ఈనెల 14న నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. పల్లె పండగపై ప్రజా ప్రతినిధులకు ముందుగా తెలియజేస్తామని అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను గ్రామస్తులకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టబోయే పనుల్లో 95 శాతం పనులకు పరిపాలన ఆమోదం లభించిందని, మిగిలిన పనులకు కూడా బుధవారంలోగా అనుమతులు పొందనున్నట్లు తెలిపారు. జిల్లాలో రహదారి సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయని, అందుకే బిటి రోడ్లకు, గోకులాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బిటి రోడ్ల కోసం రూ.51 కోట్లు, అలాగే గోకులాలు కోసం అధిక నిధులు వెచ్చించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. సీసీ రోడ్లకు అవసరమైన ఇసుక జిల్లాలో లభ్యంగా ఉందని, రహదారి పనులను వచ్చే ఏడాది జనవరి మాసాంతంలోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. వీడియో సమావేశంలో డ్వామా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా బంద్

సాలూరు రూరల్ : సాలూరు పట్టణానికి ప్రధాన మంచినీటి సరఫరా చేసే పైపు లైన్ మరమ్మతులు కారణంగా పట్టణంలో బుధవారం మంచినీటి సరఫరా చేయబడదని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయాన్ని పట్టణ ప్రజలంతా గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

శాంసంగ్ ఉద్యోగులకు మద్దతుగా మానవహారం చేస్తున్న కార్మికులు

శాంసంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చెన్నై శాంసంగ్‌లో పని చేస్తున్న కార్మికులు 4 వారాలుగా సమ్మె చేస్తున్నా పట్టిచ్చుకోని శాంసంగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ దగ్గర మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, నాయకులు శాంతికుమారి మాట్లాడుతూ 2వేల మంది ఉన్న కార్మికులు కంపెనీలో 1450 మంది సిఐటియులో సభ్యత్వం వుండి సమ్మె చేస్తుంటే, పట్టించుకోకపోవడం యాజమాన్య దుర్మార్గానికి పరాకాష్టని అన్నారు. సౌత్ కొరియా కంపెనీ యాజమాన్యం, మన దేశంలో మన రాజ్యాంగానికి అనుకూలంగా ఉండాల్సిన యాజమాన్యం, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడం దారుణమని తెలిపారు. కార్మిక హక్కులు కాలరాస్తున్న శాంసంగ్ యాజమాన్యపై చర్యలు తీసుకొని సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, లక్ష్మి, తులసి, పావని, డ్రైవరమ్మ, మంగమ్మ, పార్వతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత కంపెనీలదే

జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

ప్రజాశక్తి - మక్కువ

పొత్తు పొడవని మొక్కజొన్నతో నష్టపోయిన గిరిజన రైతులందరికీ విత్తన కంపెనీలు వెంటనే నష్టపరిహారం అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్‌పాల్ ఆదేశించారు. మండలంలోని నంద గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి, సాలూరు ఎడిఎ ఎం.మధుసూదనరావుతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తన కంపెనీలు సింజంటా, అడ్వాంట, గంగా కావేరి, పయనీర్ కంపెనీ ప్రతినిధులను పిలిపించి రైతుల సమక్షంలో వారితో కలిసి మాట్లాడారు. విత్తన కంపెనీలు నష్టపరిహారాన్ని తప్పనిసరిగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే విత్తన చట్టం ప్రకారం ఆయా కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. అలాగే మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణదారులను కూడా క్షేత్రస్థాయికి పిలిపించి విత్తనాలు కొన్న, ఎరువులు కొన్న రైతులందరికీ తప్పనిసరిగా రసీదు ఇవ్వవాల్సిందేనని, లేకుంటే దుకాణదారు లకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

దెబ్బతిన్న జొనసపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

దుకాణదారులపై చర్యలు ఏవీ?

నందలో గిరిజన రైతులు కొనుగోలు చేసిన ఏ ఒక్క దానికి రసీదులు ఇవ్వలేదని స్థానిక గిరిజనులు జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆయన మాట్లాడుతూ రసీదులు ఇవ్వని దుకాణదారులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారని ఎఒను ప్రశ్నించారు. దీంతో ఎఒ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకరికి షోకాజు నోటీసు ఇచ్చామన్నారు. అన్ని దుకాణాల రికార్డులను తనిఖీలు చేసి విత్తనాలు, ఎరువులకు సంబంధించిన తేదీలు, రికార్డులు సరి చూడాలని ఆదేశించారు. సరిగ్గా రికార్డులు నిర్వహించని వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ప్రభాకర్, స్థానిక రైతులు, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డిఎస్‌సి శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.డి గయాజుద్దీన్ ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణను సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపేనల్మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు రెండు డిఎస్‌సిరిక్రూట్మెంట్లకు శిక్షణ ఇచ్చి ఉండాలనే నిబంధనలు విధించామన్నారు. గత డీఎస్సీ రిక్రూట్మెంట్‌లో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాల్లో నియమితులై ఉండాలని పేర్కొన్నారు. మూడేళ్ల ఆదాయం రూ.40లక్షలు మించకుండా ఉండాలని సూచించారు. డిఎస్‌సి శిక్షణా సంస్థలను జాబితాలోకి చేరడానికి పూర్తి వివరాలను E-procurement portal (https://tender.apeprocurement.gov.in)లో అప్లోడు చేశామన్నారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాల కోసం ఇఒఐ డాక్యుమెంట్‌ను AP E- procurement నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 21లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా ఆశా వర్కర్ల లాగిన్ 100శాతం సమాచారంతో పూర్తి చేయాలని డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని హడ్డుబంగి సచివాలయంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులతో ఆశాలను ఫాలోఅప్ చేయాలన్నారు. డ్రై, డే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా హడ్డుబంగి ఫ్రీ పిఎం ఎస్ఎంఎస్ పథకం ద్వారా గర్భిణీలు తనిఖీ కార్యక్రమం ఎలా నిర్వర్తిస్తున్నారో పరిశీలించారు. అనంతరం మర్రిపాడు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. జ్వరాలపై ఆరా తీసి, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మందుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మర్రిపాడు వైద్యాధికారి సాయి చరణ్, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని రావివలస పిహెచ్‌సిలో జరిగిన ఆశాడే కార్యక్రమంలో డిఐఒ ఎం.నారాయణ ఆరోగ్య కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్య సమస్యలను తక్షణమే గుర్తించి వైద్యులకు సమాచారమివ్వాలన్నారు. వైద్యులకు సమాచారం చేరవేయడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలన్నారు. అలాగే గుర్తించిన ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా సిబ్బంది వెంటనేకార్యాచరణ చేపట్టాలన్నారు. అవసరమైతే వైద్యుల సలహా, సూచనలు తీసుకోవాలని సూచించారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో గర్భిణీలకు పూర్తిస్థాయి ఆరోగ్య తనిఖీలు జరగాలన్నారు. రక్తహీనత నివారణపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కార్తీక్, సూపర్‌వైజర్లు ప్రకాష్, జయగౌడు, సన్యాసమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వీరఘట్టం : ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులను గుర్తించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గర్భిణీలను గుర్తించి సకాలంలో వారికి వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. ప్రతి నెలా వైద్యాధికారితో తనిఖీలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా హైరిస్కు కేసులపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని సంబంధిత వైద్యాధికారికి హైరిస్క్ కేసులు వివరాలు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ కుమార్, సూపర్వైజర్లు శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : ఆశాల సమావేశంలో పాల్గొన్న డిఎంహెచ్ఒ విజయపార్వతి, వైద్యాధికారులు

సమస్యల పరిష్కారానికే ప్రత్యేక ప్రజా దర్బార్

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మంగళవారం కూనేరులో మండల స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతల స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్ వల్ల ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు చెప్పుకోవచ్చని, వీలైనంత వరకు తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో ఎక్కువగా హౌసింగ్, పెన్షన్లు, రిటర్నింగ్ వాల్, రహదారులు డ్రైనేజీలు ప్రజల వ్యక్తిగత సమస్యలు, గ్రామ సమస్యలను గురించి వినతులు ఎక్కువగా వచ్చాయి. అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని కొన్ని గ్రామాల ప్రజలు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో అధ్వానంగా మారిన రహదారులు, చెక్‌డాంల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కొన్ని గ్రామాలకు విద్యుత్ లైన్ల సౌకర్యాలు కొత్తగా కల్పించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ప్రజలు తెలిపిన వ్యక్తిగత, సామాజిక సమస్యలపై తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ రమేష్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శివయ్య, వివిధ మండల స్థాయి అధికారులు, మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, నాయకులు దేవకోటి వెంకటనాయుడు, జి సుదర్శన్ రావు, మధుసూదనరావు, వెంకటనాయుడు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

మండలంలో దీర్ఘకాల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరికి మండలంలో గల పలు సమస్యల పైన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ బట్టివానివలసలో పదిరోజుల్లో తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మారిన మెల్లిక సంధ్యారాణి, పవన్‌కుమార్‌ను ఆదుకోవాలని కోరారు. 16ఏళ్లుగా పెండింగ్ ఉన్న పూర్ణపాడు-లాబే సు వంతెన పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయమని కోరగా, ఆ వినతి పత్రాన్ని పంచాయతీరాజ్ శాఖ ఇఇకి ఫార్వర్డ్ చేసినట్లు తెలిపారు. ఏనుగుల సమస్య కూడా పరిష్కరించాలని, ఈ ప్రాంత ప్రజలను, రైతులను, పంటలను కాపాడాలని కోరారు. పార్వతీపురం నుంచి కూనేరుకు మూడు రాష్ట్రాలకెళ్లే రహదారి గడిచిన నాలుగు ఏళ్లుగా గోతులుగా మారడం, ఆ గోతుల్లో వర్షం నీటిలో పడి వాహనదారుల అనేకమంది ప్రమాదాల బారినపడి మృతి చెందడం, క్షతగాత్రులవుతున్నారన్నారు. ఐదేళ్లుగా ఇసుక మాఫియా పెద్ద ఎత్తున జరిగిందని, దీనివల్ల భవన కార్మికులు, ట్రాక్టర్, ఇతర కార్మికులకు ఉపాధి లేక చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది అన్నారు. కావున మండలంలో గల నాగావళి నదీ తీరాన గతంలో ఉన్న కూనేరు రామభద్రపురం, కొమరాడ, దుగ్గి, కలికోట, కొట్టు దలై పేటలో ఇసుక రీచ్ లను వెంటనే ప్రారంభించి అటు భవన కార్మికులకు, ఇటు మండలంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ సమస్యలను ఎమ్మెల్య ఈనెల 25లోగా పరిష్కరించే దీక్షగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేయించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ఈ సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు.

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

ప్రజాశక్తి
www.prajasakti.com

మంత్రి రామానాయుడుకు వినతిని అందజేస్తున్న వర్క్‌ఛార్జెడ్ ఉద్యోగ సంఘ నాయకులు

ఉద్యోగోన్నతి కల్పించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

నీటిపారుదల శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని మంగళవారం మంగళగిరిలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఛాంబార్లో వర్క్ చార్చ్‌డ్ రాష్ట్ర అధ్యక్షులు కె.కళాధర్, ప్రధాన కార్యదర్శి వి .గౌరు నాయుడు, గౌరవ అధ్యక్షులు డిజి ప్రసాదరావు, మురళీమోహన్ తదితరులు వినతి పత్రం అందజేశారు. సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ వినతిలో పేర్కొన్నారు. అనంతరం మంత్రికి సాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గోకులం నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్

గోకులం నిర్మాణాలు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న గోకులం నిర్మాణాలను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుమ్మడ, పులిపుట్టి, పెద్దబగ్గ, బొండి గ్రామాల్లోని గోకులం పథకం కింద మంజూరైన షెడ్లను ఆయన పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పులిపుట్టిలో జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఒ సత్యనారాయణ, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - భామిని

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఈనెల 6 నుంచి 8 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 కబడ్డీ పోటీల్లో భామిని మండలం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని ఎ.రీబికా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్ తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని, వ్యాయామ ఉపాధ్యాయులు శివరాం ప్రసాద్‌ను ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన రీబికా

కోటదుర్గమ్మను దర్శించుకున్న మాజీ స్పీకర్

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో కోటదుర్గ అమ్మవారిని మంగళవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఇఒ సూర్యనారాయణ అందించారు. ఈయనతో పాటు బూర్జ ఎంపిపి కర్నేని నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, తదితరులు ఉన్నారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని. తుమరాడకు చెందిన నండ సూరప్పడు అనే వృద్ధుడికి అదే గ్రామ జనసేన నాయకులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సూరప్పడు ఇంటికి జనసేన నాయకులు వెళ్లి ఆయనకు రూ.2 వేలు ఆర్థికసాయంతో పాటు నెలకు సరిపడే బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో తుమరాడ గ్రామ జనసేన నాయకులు నోడగాన తాతబాబు, మర్రాపు సురేష్, వాసిరెడ్డి సాయిమోహన్, పడాల జయరాం, ఎడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులపై చిన్న చూపు వద్దు

ప్రజాశక్తి - కురుపాం

హెచ్‌ఐవి బాధితులను చిన్న చూపు చూడకూడదని వైడిఒ నెట్వర్క్ అవుట్ రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. మండలంలో దురిబిలిలో మీకు తెలుసా అనే కార్యక్రమంలో యువత, గ్రామస్తులకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఐవి వ్యాధి సోకి ఉన్నవారిపై చిన్నచూపు చూడకూడదని దీనివల్ల వారు అందరితో కలిసి ఉండలేక మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, ఇది క్యాన్సర్ కన్నా ప్రాణాంతక వ్యాధి కాదని, సాధారణ వ్యాధిగా చెప్పుకోవచ్చని, ఎవరైనా వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు చూచినట్లయితేశిక్షా అర్హులవుతారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.

జన సంచారానికి దూరంగా మద్యం షాపులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రముఖులు పిబి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని వేగావతి వంతెన నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జనసంచారం ఎక్కువగా ఉంటుందని, ఆ ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందికరమవుతుందని చెప్పారు. అంతే కాకుండా మద్యం ఎక్కువ సేవించే వారితో గొడవలు జరిగి శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, గతంలో కొన్ని హైకోర్టు తీర్పుల మేరకు ఎక్సైజ్ అధికారులు షాపులకు అనుమతులు మంజూరు చేయాలని శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

చినబొండపల్లిలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని చిన్న బొండపల్లిలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు చెలరేగకుండా పోలీసులు ముందస్తు చర్యలు భాగంగా మంగళవారం గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఎస్సై దినకర్ మాట్లాడుతూ రెండు వర్గాల మధ్య జరిగిన స్వల్ప వివాదం కొట్లాటగా మారిందని, అయితే సోమవారం రాత్రి పోలీసుల జోక్యంతో తగువులు సద్దుమణిగినప్పటికీ, యువతలోఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు గ్రహించి ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇరువర్గాలను సమావేశపర్చి కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామంలో ఒకే చోట ఉన్న యువత

ప్రతి సమస్యా సకాలంలో పరిష్కారం కావాలి

14 నుంచి 23 వరకు సామూహిక భూమి పూజలు
సాగునీటి సంఘాల ఓటరు జాబితాలు సిద్ధంచేయాలి
కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన ప్రతి సమస్య సకాలంలో పరిష్కరించబడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు పిజిఆర్ఎస్‌లో 90 ఫిర్యాదులు పెండింగ్ ఉండడంపై శాఖల వారీగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభికతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఉపాధిహామీ, సామూహిక భూమి పూజ, సాగునీటి సంఘాల ఎన్నికలు, గృహ నిర్మాణాలు, ఉపాధిహామీ తదితర అంశాలపై సమీక్షా సమావేశం మంగళవారం కలెక్టర్ కార్యాలయం వీసీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీపై సమగ్ర విచారణ జరిపి 24గంటల్లోగా సమస్యను పరిష్కరించాలని, కొన్ని కేసుల్లో 48 గంటలకు సమయం మించరాదని తెలిపారు. సమస్య పరిష్కారంతో అర్జీదారుడు పూర్తిగా సంతృప్తి చెందాలని, పరిష్కారం కోసం ఏదో ఒక సమాధానం ఇచ్చి తప్పించుకునే ధోరణి పనికిరాదని హితవు పలికారు. కొందరు అధికారులు పిజిఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను ఇప్పటివరకు గమనించక పోవడం పట్ల కలెక్టర్ మండిపడ్డారు.జిల్లా అధికారులు ప్రతి రోజూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సాధ్యమైనంత మేరకు అదే రోజు సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా సంబంధిత నోడల్ అధికారులు బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. పింఛన్లు, రేషన్ కార్డుల కొరకు జిల్లా కేంద్రానికి ప్రజలు వస్తున్నారని, అటువంటి వాటిపై ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన తక్షణమే పని జరుగుతుందని గ్రామ స్థాయిలోనే కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పనిచేసే వారికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలను చెల్లించాలని చెప్పారు. సాంకేతిక సమస్యలు ఉంటే 91544 09661 ప్రహ్లాద్ కి ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

14నుంచి 23 వరకు సామూహిక భూమి పూజలు

ఈనెల 14 నుంచి 23 వరకు పల్లె పండగ పేరుతో గ్రామస్థాయి వారోత్సవాలను నిర్వహించాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. గత గ్రామ సభల్లో తీర్మానించిన పనుల వివరాలను గ్రామ పంచాయతీల వారీగా పనులు ప్రదర్శించి, ఆ పనులకు ఈనెల 14 నుంచి 23 వరకు సామూహిక భూమి పూజలు నిర్వహించాలన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు అందరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రహదారులకు, గోకులాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంద కుటుంబాలు కంటే తక్కువ ఉన్న గ్రామాలకు సిసి, బిటి రోడ్లు, 50 కంటే తక్కువ కుటుంబాలు ఉన్న గ్రామాలకు గ్రావెల్ రోడ్లు వేయాలని తెలిపారు. రహదారి పనులన్నీ జనవరి మాసాంతంలోగా పూర్తికావాలని అన్నారు.

బాల విహార్ అన్ని చోట్ల నిర్మించాలి

బాలలను ఆదుకునేందుకు వీలుగా ఆటల పరికరాలతో కూడిన బాల విహార్ పార్కులను అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే లైబ్రరీలు, సామూహిక మార్కెట్ షెడ్లు, కమ్యూనిటీ టాయిలెట్స్, బస్ షెల్టర్లు వంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో చేపట్టబోయే పనులు, నిధుల వివరాలు గ్రామాల్లో ప్రదర్శించాలని అన్నారు.

16 నుంచి నవంబర్ 24లోగా సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తికావాలి

సాగునీటి సంఘాలకు పూర్వవైభవం తెచ్చే దిశగా ఈ నెల 16 నుంచి నవంబర్ 24లోగా సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మీడియం 75, మైనర్ 538 వరకు సంఘాలు ఉన్నాయన్నారు. ఆయకట్టు సర్వే నెంబరులోని రైతుల వివరాలు సేకరించి, ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో జేసీ నోడల్ అధికారిగా, సబ్ కలెక్టర్లు డివిజనల్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు. వీడియో సమావేశంలో పార్వతీపురం, సీతంపేట సబ్ కలెక్టర్లు, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడిఓలు, ఏపీఓలు, పీఆర్,ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈలు,ఈఈలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

పంచాయతీల నిర్వహణపై ఇచ్చిన శిక్షణను వినియోగించుకోవాలని ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం అన్నారు. స్థానిక వైటిసిలో రెండు రోజులు ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు, ఉపసర్పంచుల బాధ్యతలు, విధుల గురించి వివరించారు. ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. పంచాయతీరాజ్ చట్టాల గురించి వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుదర్శనరావు, రాజశేఖర్, శ్యామ్, పాపారావు, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మానవాళి వనరులు వినియోగించుకుంటే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని, ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లు, ఫీల్డ్ సహాయకులు సచివాలయాల శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. ముందుగా పంచాయతీల అభివృద్ధిపైన ప్రణాళికలు వేసుకోవాలని తద్వారా వాటిపైన కార్యచరణ చేసుకుంటే అనుకున్న రీతిలో లక్ష్యాలను అధిగమించగలమన్నారు. విధినిర్వహణలో అలసత్వం వల్ల పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుందని, మన విధులు సక్రమంగా ఉన్నప్పుడు ఆటోమేటిక్ పంచాయతీలు కూడా అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. పంచాయతీ పాలకవర్గాలతో సమావేశం నిర్వహించినప్పుడు వారితోనే ఏఏ పనులు చేయాల్సి ఉంది, వాటిపై తీర్మానాలు చేయించి పంచాయతీల్లో అభివృద్ధి చేయలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసే పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో మండల పరిషత్తు ఎఒ డి.వెంకటరమణ, సచివాలయ కార్యదర్శులు, వార్డు మెంబర్లు, ఉపాధి ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక మండలం పరిషత్తు సమావేశ భవనంలో బుధ, గురువారాల్లో మండలంలోని 30 పంచాయతీలకు చెందిన ఉపసర్పంచులు, వార్డుసభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఆర్థిక ప్రణాళిక, పంచాయతీలో పనుల గుర్తింపుతో పాటు సాధారణ పరిపాలనలో వార్డు మెంబర్లు, ఉప సర్పంచుల బాధ్యతలు విధుల గురించి ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రమణమూర్తి, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడన వైద్యశాఖ : సిపిఎం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గిరిజన గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారినపడి మృత్యువాతపడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ నిమ్మకు నీరేతినట్టుగా వ్యవహరిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు విమర్శించారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ స్థానిక ఏరియా హాస్పిటల్‌లో సరిపడా బెడ్లేక లేక జ్వరాలతో వచ్చిన రోగులు అనేక మంది మందులు తీసుకొని ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పేరుకే 100 పడకల ఆస్పత్రి అని, 50 పడకలు దాటి లేవని అన్నారు. అలాగే గ్రామాల్లో రక్షిత మంచి నీరు, దోమ తెరలు లేక గిరిజనులు వ్యాధుల బారినపడుతున్నారని అన్నారు. ఐటిడిఎ ఉన్నా గిరిజనులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ హాస్పిటళ్ల దోపిడీ పెరిగిందన్నారు. సీజనల్ జ్వరాలు కామన్ అని చెప్పిన అధికారులు సీజనల్ తర్వాత ఇదే పరిస్థితి ఎందుకు ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని, లేకుంటే ఆందోళన చెప్పడతామని హెచ్చరించారు.

12మద్యం షాపులకు 126దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు సంబంధించి ఆన్లైన్ ద్వారా మంగళవారం సాయంత్రం నాటికి 126 దరఖాస్తులు వచ్చినట్లు ఎఇఎస్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన సీతానగరంలోని దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఇంతవరకు వచ్చిన దరఖాస్తులను, డిడిలను పరిశీలించి చేపడుతున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. ఎటువంటి అపోహలు లేకుండా ఆసక్తి కలిగిన వారు బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తులు అందజే యాలన్నారు. లాటరీ ద్వారా షాపుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు.

చెత్త శుద్ధి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి గ్రామ సచివాలయాన్ని మంగళవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయంలోని దస్త్రాలను పరిశీలించారు. సిబ్బంది పనుల వివరాలను తెలిపే రిజిస్ట్రీ ఒకటి పెట్టి ఎవరు ఏ పని మీద వెళ్లినా ముందు మూమెంట్ రిజిస్ట్రీలో రాయాలని కార్యదర్శి లక్ష్మికి సూచించారు. కార్యక్రమం లో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎఆర్ రమణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రూపేష్

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుంపు సోమేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కొమరాడ

నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వరాలయం ఎంతో ప్రతిష్ట గాంచిన ఆలయంగా ఉందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం కోటిపాం కాలనీ నుంచి గుంప శివాలయానికి రహదారి శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటిపాం కాలనీ వద్ద కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన పనులు ప్రారంభించారు. అనంతరం జెసిబితో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివాలయానికి ఎంతో ప్రతిష్ట ఉందని, గత ప్రభుత్వాలు శంకుస్థాపన పనులు చేసి ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ముందుగా ఆలయానికి రోడ్డు సదుపాయం కల్పించి అనంతరం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ రమేష్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శివయ్య, వివిధ మండల స్థాయి అధికారులు, ఆలయ అభివృద్ధి దాతలు కాపారపు శివన్నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, నాయకులు దేవకోటి వెంకటనాయుడు, జి.సుదర్శన్‌రావు. మధుసూదనరావు, వెంకటనాయుడు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్‌టిసి డిపో దగ్గర నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై గేట్ మీటింగ్ చేపట్టినట్టు డిపో కార్యదర్శి వి.రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ కె.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పిఎల్ రావు, డిపో అధ్యక్ష కార్యదర్శి ఎం.సుబ్బారావు, వి.రాజేష్, ఎం.వైకుంఠం, ఎస్‌టి రావు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కారించాలని, లేకుంటే దశల వారీగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జాగ్రత్తలు తప్పనిసరి

రాజాం : దసరా నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ఆటోల్లో మైకులు పెట్టి మంగళవారం పట్టణంలో ప్రచారం చేశారు. ఇల్లు విడిచి వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులు, నగలు, నగదు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

అపస్మారక స్థితిలో ఉన్న సాగర్

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్సై ఎం.రాజేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జగ్గునాయుడుపేటకు చెందిన వానపల్లి సాగర్ (20)తన మిత్రులైన జనుమూరు శివ వరప్రసాద్, జి.పారంన్నాయుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై తన గ్రామం నుంచి సీతానగరం వెల్డింగ్ షాప్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో చినబోగిలి- కాసాపేట గ్రామాల మధ్యలో ఉన్న డాబా వద్ద బొబ్బిలి నుంచి సీతానగరం వెళ్తున్న ఎక్సెల్ ద్విచక్ర వాహనం వచ్చి వీరి వాహనాన్ని ఢీకొనడంతో సాగర్, శివ వరప్రసాద్, పారంన్నాయుడుతో పాటు మరో వ్యక్తి కూడా అక్కడికక్కడే కిందకి పడిపోయారు. గాయాలైన నలుగురిని పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించగా, అపస్మాత్తుగా స్థితికి వున్న సాగర్ మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. పారన్నాయుడు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నూతన పద్ధతుల్లో సాగుచేయాలి

పొలంబడి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి

ప్రజాశక్తి -సాలూరురూరల్

రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో అధునాతనమైన పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. మండలంలోని మామిడిపల్లి, అన్నంరాజువలస రైతు సేవా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో జరుగుతున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. మూస పద్ధతుల్లో కాకుండా ఒకే పంటను సాగు చేయకుండా రెండు మూడు రకాల పంటలను సాగుచేస్తూ అధికాదాయాన్ని పొందాలని అప్పుడే నష్టాల భయం కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి మంగళ, బుధ వారాల్లో ప్రతి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని, దీనికి రైతులంతా హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ, అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలో బూస తవుడు వరి పంటలో పాము పొడ తెగులు ఎక్కువగా ఉందని దీని నివారణ తీసుకోవాలని సస్యరక్షణ చర్యలను వివరించారు. సాలూరు ఎడిఎ మధుసూదన్ రావు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఎక్కువగా పంటను ఆశించి నష్టం కలిగిస్తుంది అని, కావున రైతులు అంతా ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును ఎకరానికి 100 గ్రాము చొప్పున పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. హార్టికల్చర్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసరాజు అరటి, ఆయిల్ పామ్, కోకో, జీడి మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్, స్ప్రింకలర్లు సబ్సిడీ లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి బి.ఝాన్సీ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ పండా, మామిడిపల్లి, అన్నమరాజువలస, సర్పంచులు సువ్వడ శశికళ,చీమల రాములమ్మ,నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు బుస తవుడు, సువ్వాడ రామకృష్ణ,మాధవ రావు, తిరుపతిరావు, విఎఎలు, ఉద్యాన సహాయకులు , గ్రామ రైతులు పాల్గొన్నారు.



పెదగొత్తిలిలో నిర్వహిస్తున్న పొలంబడి

సీతానగరం : మండలంలోని గాదెలవలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి క్షేత్ర పరిశీలన జరిపి దోమపోటును గమనించారు. దీని నివారణకు ట్రిప్లొమాపీరైజిం పెక్సలాన్ ఎకరాకు 100మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. అవినాష్ సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి జెవి ప్రసాద్ తెలిపారు. ఎఎస్ఒ పంట కోత ప్రయోగాలను విఎఎలు, ఉద్యానవన సహాయకులకు శిక్షణ ఇచ్చారు. మండలంలో వరి, గోగునార పంట కోత ప్రయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ పెద్దలు, రైతులు, విఎఎలు,ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

కురుపాం : రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచుకొని అధిక దిగుబడుల సాధనకు పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉపయోగంగా ఉందని మండల వ్యవసాయధికారి నాగేశ్వరావు అన్నారు. మండలంలో పెదగొత్తిలిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పశువులు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగానే టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ కె. శైలజ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకనాథం, వ్యవసాయ సహాయకురాలు భార్గవి, రైతులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో తుంబకొండ, మానాపురంలో ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎన్ లక్ష్మీనారాయణ రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. చీడ పీడల నివారణకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడుల గురించి రైతులకు కొన్ని మెలకువలు నేర్పించారు. తెగుళ్ళ వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ పి.శ్రీదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని ఉలవ పంట వేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు మండలంలోని గొట్టూరు, గరిసిగుడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్‌లోనూ జల్లులు కురిసే అవకాశం ఉందని, ఆ కాస్త భూమిలో ఉన్న తేమను సద్వినియోగం చేసుకొని గిరిజన పోడుల్లో ఉలవ పంట వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కలుపు మందు వాడకూడదన్నారు. అలాగే మొక్కజొన్న పంటకు బదులుగా చిరుధాన్యాల సాగును పెంచాలన్నారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి మొత్తం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం 90శాతం రాయితీపై ఉలవ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సందర్శించారు. చదల రాజు అనే రైతు ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండించిన పసుపు పంటను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి, కిరణ్, ప్రకృతి సేద్య ఎల్ వన్ తిరుపతి నాయుడు, సురేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు

సేంద్రియ పద్ధతులపై అవగాహన

సీతంపేట : మండలంలోని కీసరజోడు పంచాయతీ దిగువకాలువరాయిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సేంద్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి, జీడి, పైనాపిల్, చీపుర్లు, చిరుధాన్యాలు, పంటలు గురించి కెవికె బృందం తెలిపారు. ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి గణేష్ వివిధ పథకాలు రైతులకు ఇవ్వడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. పండించిన పంటలకు విలువ జోడింపు గూర్చి ఎఫ్‌పిఒల పాత్ర గురించి వివరించారు. వెలుగు అధికారి బి.సంజీవరావు వెలుగు అసోసియేషన్ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఒ జయశ్రీ, కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోమపోటు నివారణకు చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్ : వరి పంటను ఆశిస్తున్న దోమపోటు నివారణకు వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు తీసుకుని, పాటించాలని జిల్లా రిసోర్స్ కేంద్రం ఎడిఎ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరం, సంగంవలసలో మండల వ్యవసాయాధికారి అశోక్ ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. వరి పైరును ఆశిస్తున్న తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఎక్కువగా మండలంలో దోమపోటు తాకిడి ఉన్నట్లు రైతులు తెలియచేస్తున్నారని, వరి నాట్లు వేసుకునేటప్పుడే వరుస వరుసకు మధ్య ఖాళీలు ఉంచుకుంటే గాలి ధారాళంగా తరలి దోమ ఆశించదని తెలిపారు. దీని నివారణకు ఏమిడాక్లోర్, ఎసిఫేట్ ద్రావణాన్ని ట్యాంకుకు ఐదు గ్రాములు చొప్పున నీళ్లలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, సర్పంచులు వంగపండు లక్ష్మీ త్రినాధ నాయుడు, బడే శ్రీరంజన్, రైతులు బడే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.